
వీరభద్రారెడ్డి
1
&
2
మధుబాబు

# ఒక మాట

నేటి తెలుగు దేశాన్నంతటినీ ఏకచక్రాధిపత్యంగా క్రీ.శ. 1200వ సంవత్సరం నుంచి 1325 వరకూ పరిపాలించిన వంశం–కాకతీయ వంశం.

కాకతీయ సామ్రాట్టయిన శ్రీశ్రీశ్రీ గణపతి దేవుడికి పురుష సంతానం లేకపోవటం వల్ల, తన కుమార్తె అయిన రుద్రమదేవిని తన తరువాత కాకతీయ సామ్రాజ్యానికి వారసురాలిగా ప్రకటించాడు.

ఒక ఆడది రాజ్యాన్ని పరిపాలించటం అవమానమని భావించి, తిరుగుబాటు బావుటాన్ని ఎగురవేశారు ఎంతోమంది. కళింగంనుంచి, దేవగిరినుంచి, కొంకణం నుంచి, పాండ్యనాడు నుంచి శత్రువులు ఒకరొకరుగాను, ఒక్కుమ్మడిగాను సామ్రాజ్యంమీదికి దండెత్తి వచ్చారు.

రాజ్యంలో శాంతిభద్రతలు క్షీణించాయి. గ్రామసీమలు శత్రువుల దురంతాలకు, దురాగతాలకు గురికాజొచ్చాయి. అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు విచ్చలవిడి అయిపోయాయి. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని విపత్కర పరిస్థితి. ఎటుచూసినా అశాంతి, అల్లరి... ముఖ్యంగా నమ్మకద్రోహం.

ఈ సమయంలో భువనగిరి ప్రాంతాన్ని పరిపాలించే గోనగన్నారెడ్డి, శ్రీకాకుళ ప్రదేశానికి ప్రభువులైన బదులూరి అన్నయమంత్రి, కొలను రుద్రదేవుడు–

కాయస్త సేనా నాయకులైన జన్నిగదేవ, అంబదేవ త్రిపురాంతకాలు, ఆ తరువాత ప్రధాన దండనాయకుడైనటువంటి ప్రసాదిత్య నాయకుడు మొదలైనవారందరూ తమ తమ శక్తిమేరకు దేశాన్ని సుభిక్షం చేయటంలో రుద్రమదేవికి తోడ్పడ్డారు. ఇదిగో... ఈ గొడవల మధ్యన ప్రారంభం అవుతుంది నా ఈ వీరభద్రారెడ్డి.

చరిత్రకాదు ఇది... చరిత్రను నేపథ్యంగా తీసుకుని కల్పించిన ఒక మృదుమధుర సాహసగాథ. మీకు నచ్చుతుందనే ఆశిస్తూ – నమస్కారం.

**మధుబాబు**

# మా వద్ద లభించు మధుబాబు నవలలు

వీరభద్రారెడ్డి (1వ భాగం)

వీరభద్రారెడ్డి (2వ భాగం)

దొంగ...దొంగ...దొంగ

మిస్సింగ్ నెంబర్

టైమ్ బాంబ్

భవాని

రెడ్ ఎలర్ట్

సాధన

టచ్‌మి నాట్

శ్రావణి

# వీరభద్రారెడ్డి

పట్టు పరికిణీ కుచ్చిళ్ళు పాదాలకు అడ్డం పడ కుండా, మునివేళ్ళతో ఎత్తి పట్టుకుని, పకపకా నవ్వుతూ, పరిగెత్తింది పొన్ని. ఎదురుగా కనిపిస్తోంది ఎత్తయిన కొండగుట్ట. పచ్చటి పొదలతో, ఎత్తయిన చెట్లతో పెద్ద కీకారణ్యం మాదిరి కనిపిస్తోంది అక్కడి చుట్టుపక్కల వాతావరణం.

గుట్ట మొదట్లో దట్టంగా పెరిగి వున్నాయి సంపంగి పొదలు. వాటి చాటున దాక్కుంటే తనను కనిపెట్టడం కష్టమని పొన్ని అభిప్రాయం. పాతిక అడుగుల దూరం పోక ముందే, “ఆగవే పొన్నీ, అటు పోమాకు. ప్రమాదం. ఆగిపో” అంటూ అరిచింది ఆమెతోపాటుగా అక్కడ ఆట లాడటానికి వచ్చిన బాలిక ఒకర్తె.

ఎవరైనా సరే ఎడ్డెమంటే- వెంటనే తెడ్డెమనే మనస్తత్వం పొన్నిది. ఆ అరుపును ఆలకించేసరికి మరింతగా బలపడి పోయింది గుట్ట దగ్గిరికి పోవాలనే ఆమె కోరిక.

"నా మాట వినవే పొన్నీ... సంపంగి పొదల దగ్గిర కాపురాలు చేస్తూ వుంటాయి పాములు. నిన్ను చూశాయంటే మీదపడి ప్రాణాలు తీసేస్తాయి" మరో అరుపు బిగ్గరగా అరిచింది ఆమె స్నేహితురాలు.

భుజం మీదినించి వెనక్కి చూస్తూ ఇంకోసారి పకపకా నవ్వింది పొన్ని. "దొంగపిల్లా- లేనిపోని భయాలు చెప్పి నన్ను పట్టుకోవటానికి ఎత్తు వేశావా? పట్టపగలు పాములు మీద పడటం ఏమిటి? నేను నమ్మనుగాక నమ్మను" అంటూ తన పరుగును కొనసాగించింది.

ముంచుకు వచ్చేసింది ఉక్రోషం ఆమె స్నేహితురాలికి. తను కూడా వేగంగా పరుగు మొదలుపెట్టింది.

గుట్ట మొదట్లోకి చేరుకున్నది పొన్ని. అడుగు పెట్టడానికి వీలుకానంత దట్టంగా అల్లుకొని వున్న సంపంగి పొదల మధ్యలోకి దూరి, ఒక గుబురు చాటున ఒదిగిపోయి కూర్చుంది. పట్టుదల కోసం వేగంగా పరిగెత్తుకు వచ్చిందే గాని, ఆ సంపంగి పొదల్లోకి అడుగుపెట్టడానికి ధైర్యం చాలలేదు ఆమె స్నేహితురాలికి.

"ఎంతసేపయినా సరే ఇక్కడే కూర్చుంటాను. ఇవాళ నిన్ను పట్టుకుని దొంగను చేయకపోతే నాకు మారు పేరు పెట్టు" అంటూ ఒక బండమీద బాసిపట్టు వేసుకు కూర్చున్నది. పదినిమిషాలు గడిచిపోయిన తర్వాత కూడా ఆమె అక్కడి నుంచి కదలకపోయేసరికి, కొద్దిపాటి అలజడికి గురి అయింది పొన్ని, ఆ సమయంలో-

రావటమైతే మొండిగా వచ్చి కూర్చున్నది గాని, అలా ఆ సంపంగి పొదల మధ్య అధిక సమయం గడపటం అంటే- చేజేతులారా చేటును కొని తెచ్చుకోవటమేనని ఆమెకు తెలుసు. సంపంగి పువ్వుల వాసన రకరకాల కీటకాలను ఆకర్షిస్తుంది. వాటిని ఆహారంగా తీసుకోవటానికి ఆ పొదల మీదనే కాపురం పెడతాయి బల్లులు. తొండలు మొదలయిన జాతులకు చెందిన జీవాలు.

ఆ జీవాల కోసం అక్కడకు వస్తాయి పక్షులు. ఆ పక్షులను పట్టుకోవటానికి మాటు వేస్తాయి సర్పాలు. అదృష్టం బాగుండి అవేవీ ఇంతవరకూ తనకు కనిపించలేదు. అలాగని చెప్పి మరింత ఆలస్యం చేయటం ఎంత మాత్రము మంచిది కాదు. బండరాయిమీద కూర్చుని వున్న స్నేహితురాలిని వెంటనే కొంచెం అవతలికి పంపి, ఆమె అటు కదలగానే తను బయటికి పరిగెత్తాలి.

పొదల మీదినించి రాలిపడిన ఎండుటాకుల కింద పొన్నికి దొరికింది చిన్నపాటి గులకరాయి. పొదమీది ఆకులు కదలకుండా నెమ్మదిగా చేతిని ఎత్తి బలంగా ఒక పక్కకు విసిరింది ఆమె– ఆ రాయిని.

గింగిరాలు తిరుగుతూ వేగంగా పోయి, స్నేహితురాలు కూర్చుని వున్న ప్రదేశానికి పాతిక ధనువుల దూరంలో వున్న ఒక ఎండు పొద దగ్గిర పడింది అది. ఛట్‌మని శబ్దం చేసింది. తాచుపాములా తల తిప్పి అటుకేసి చూసింది స్నేహితురాలు. “అమ్మ దొంగా... చప్పుడు చేయకుండా పారిపోవటానికి చూస్తున్నావా? నిన్ను వదిలిపెడతానని అనుకున్నావా?” అంటూ బండ మీదినించి దూకి అటుకేసి పరిగెత్తిందామె మరింత వేగంగా.

వెంటనే సంపంగి పొదల మధ్యలోనించి బయటికి వచ్చింది పొన్ని. పకపకా నవ్వుతూ పరుగు మొదలుపెట్టబోయి– అదిరిపడి ఒక్కసారిగా ఆగింది.

ఎండుపొద దగ్గిరికి పోయిన స్నేహితురాలు– ఎగిరి వెనక్కి దూకుతూ వెర్రిగా అరవటమే అందుకు కారణం.

పలుకురాయి పడిన ప్రదేశంలో వున్నది చిన్నపాటి పల్లపు ప్రదేశం. అందులో తమ పట్టును రహస్యంగా పెట్టుకున్నాయి పెద్ద పెద్ద కొండ తేనెటీగలు.

రాయివచ్చి పట్టుకు తగిలేసరికి, చెవులు చిల్లులుపడేటట్లు వికృత శబ్దాలు చేస్తూ గాలిలోకి లేచాయి.

అవి గనుక కుట్టడం జరిగితే తట్టుకోవటం కష్టమని పొన్నికి తెలుసు. “వచ్చేయవే... వెనక్కి వచ్చేయ్... త్వరగా త్వరగా” అని బిగ్గరగా అరుస్తూ స్నేహితురాలికి ఎదురువెళ్ళి ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నది.

“వచ్చేస్తున్నాయ్.... మీదికి వచ్చేస్తున్నాయ్” విపరీతమైన భయంతో వణికిపోతూ అన్నది స్నేహితురాలు.

ఆమెకు ధైర్యం చెప్పే ప్రయత్నం చెయ్యలేదు పొన్ని. ఆమె చేతిని గట్టిగా పట్టుకుని పరిగెత్తటం మొదలుపెట్టింది. తమ ఏకాంతానికి అడ్డం

వచ్చిన జంతువునైనా, మనుష్యులనైనా ఊరికే వదిలిపెట్టే ప్రసక్తి లేనట్టు వేగంగా వారిని వెంబడించాయి ఆ కొండ తేనెటీగలు.

తప్పించుకోవటం అసాధ్యం అని అర్థం అయిపోయింది పొన్నీకి. వద్దు వద్దని అంటున్నా వినకుండా తను సంపంగి పొదల మధ్యకు పోవటమే ఆ అనర్థానికి మూల కారణం. తను చేసిన తప్పుకు తన స్నేహితురాలు కూడా ఇప్పుడు దండన అనుభవించాల్సి వస్తోంది...

ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అతి ప్రయత్నం మీద అదిమి పట్టుకుంటూ ఆత్మరక్షణ చేసుకునే మార్గం కోసం అటు ఇటు చూసింది ఆమె.

సరిగ్గా అదే సమయంలో సున్నితమైన ఆమె మెడమీద వాలింది ఒక తేనెటీగ. తనకు తెలియకుండానే దాన్ని విదిలించిపారేసింది ఆమె. "నా పని అయిపోయిందే. నేను ఇక పరిగెత్తలేను" అంటూ ముందుకు తూలింది ఆమె స్నేహితురాలు. మందపాటి కంబళి మాదిరి కనిపిస్తూ వచ్చేస్తున్న ఆ విషపు కీటకాలను చూస్తూ తను కూడా ఇక పరిగెట్టలేక ఆగిపోయింది పొన్ని.

అయిపోయింది తమ పని. ఒక్క ఈగ కుడితేనే తట్టుకోవటం కష్టం. ఒకేసారి అవన్నీ వచ్చిపడితే-

ఆపైన ఆలోచించటానికి భయమేసి కళ్ళను గట్టిగా మూసుకున్నది ఆమె. దగ్గిరికి వచ్చేసింది ఆ విషపు జీవుల ఝుంకారం. ఏ క్షణంలోనైనా అవి తమ విషపు ముళ్ళను తమ శరీరాలమీద ప్రయోగించవచ్చు.

ఉన్నట్లుండి బలమైన ఈదురుగాలి వచ్చి తమను తాకిన అనుభూతి కలిగేసరికి, ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది ఆమె. ఎక్కడినించి వచ్చాడో, ఎలా వచ్చాడో, ఎప్పుడు వచ్చాడో తెలియదుగాని, వారి దగ్గిరికి వచ్చేశాడు తూర్పువీధి శివారెడ్డి కొడుకు వీరభద్రారెడ్డి.

"మూసుకోండి. కళ్ళను గట్టిగా మూసుకోండి. కళ్ళ మీద కాటు పడకుండా చేతులు అడ్డం పెట్టుకోండి" అని హెచ్చరిస్తూ అమాంతంగా దగ్గరకొచ్చి ఇద్దర్నీ బలంగా ఎత్తి, తన భుజాలమీద వేసుకున్నాడు.

ఎంత బలం వున్నా అతను తమ ఇద్దరి బరువును భరించటం- పగబట్టిన పాముల్లా వచ్చేస్తున్న ఆ ఈగల్నించి తప్పించుకోవటం అసాధ్యం అనిపించింది పొన్నీకి.

“మా కోసం నువ్వు కష్టాల్ని కొనితెచ్చుకోకు. పారిపోయి నీ ప్రాణాల్ని నువ్వు కాపాడుకో” అని అరవాలని అనిపించింది ఆమెకు. మాటలు పెదవుల్ని దాటి బయటికి రాలేదు. ఆమె ఊహించినట్టు అతను వారిద్దరిని భరిస్తూ ఎంతో దూరం పోలేదు. పక్కనే పది అడుగుల దూరంలో వున్న ఒక పెద్ద పల్లపు ప్రదేశంలోకి ఎగిరి దూకాడు.

ఏడు ధనువులకు పైనే లోతున్న పల్లం అది. అంతకు ముందు పక్షం రోజులక్రితం కురిసిన వర్షానికి మూడొంతులకు పైగా నీటితో నిండి వున్నది.

దభేలున నీటిని తాకేసరికి ఊపిరి ఆగినంత పనైంది పొన్నీకి. నాసికా రంధ్రాలలోకి దూసుకువచ్చిన నీటి మూలంగా ఉక్కిరిబిక్కిరై నీటిపైకి తేలబోయింది.

“తలలు బయటికి పెడితే అవి వదిలిపెట్టవు. చావకుట్టేస్తాయి” అంటూ ఆమె తలను, స్నేహితురాలి తలను బలవంతంగా నీటిలో ముంచాడు వీరభద్రా రెడ్డి.

నిజంగానే ఊపిరి అందక గిజగిజలాడిపోయారు వారిద్దరూ. తమను అదుముతున్న అతని చేతుల్ని అవతలికి విదిలించి, తలల్ని బయటికి పెట్టారు.

పల్లపు ప్రదేశం పైభాగంలో చక్కర్లు కొడుతున్నాయి తేనెటీగలు. వేగంగా నీటిమీదికి వచ్చేశాయి.

ఒకసారి గనుక అవి తాము మునిగిన ప్రదేశాన్ని గుర్తుపెట్టుకుంటే, ఒక పట్టాన అక్కడినించి కదలవని పొన్నీకి తెలుసు. అలాగని తాము ఎంతోసేపు నీటిలో మునిగి వుండటం కష్టం. ఊపిరి తీసుకోవటానికి పైకొచ్చి తీరాలి.

ఆమె మనస్సులో మెదులుతున్న ఆలోచనలు తనకు అవగతమై పోయినట్టు వేగంగా కదిలాడు వీరభద్రారెడ్డి. తను చేస్తున్నది తప్పని అనుకోలేదు ఆ సమయంలో. చేతుల్ని జాచి బర్రున పొన్ని పావడాని లాగేశాడు. చేపలు పట్టే వలమాదిరి విదిలించి, నీటిపైకి వచ్చిన ఆమె తలమీద, స్నేహితురాలి తలమీద కప్పాడు.

కసితీరా ఆ పావడాని కుట్టి వదిలాయి తేనెటీగలు. కుట్టిన తర్వాత తమ విషపు ముళ్ళని ఆ వస్త్రంలోనించి బయటికి లాక్కోవటం చేతకాక గిలగిలలాడుతూ ఆ పావడామీదే ఉండిపోయాయి అవి.

ఎంతసేపటికీ తమ స్నేహితురాళ్ళు గుట్టదగ్గిర్నించి వెనక్కి రాకపోయే సరికి, పెద్దగా పిలుస్తూ ఆ ప్రదేశంలోకి వచ్చారు పొన్నీ స్నేహితురాళ్ళు ఇంకా అనేకమంది. నిస్త్రాణగా నీటిలో నిలబడి వున్న బాలికను, పావడా వదిలేసి నిలుచున్న పొన్నీని చూసి నిర్ఘాంతపోయారు.

[ [ [ [ [

కంటికి కనిపించనంత వేగంతో పైకి లేచి, ఛట్‌మని శబ్దం చేస్తూ వీరభద్రారెడ్డి వెన్నుమీద పడింది చర్మపు కొరడా. కత్తిపెట్టి చీరినంత బాధ ఆవరించుకుంది అతన్ని. గిర్రున తిరిగాయి కళ్ళవెంట నీళ్ళు. నోరు తెరిచి పెద్దగా అరవాలన్న కోరిక కూడా కలిగింది.

"ఒక్క దెబ్బ వేయటానికే ఇంత సమయం పడితే పాతిక దెబ్బలు ఎప్పటికి పూర్తి అవుతయ్? కొట్టరా... కొట్టు" ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు బసివిరెడ్డి- కొరడాని పట్టుకున్న వ్యక్తిని.

"బాబాయ్... కొంచెం ఆలోచించు... ఆవేశపడకు" అంటూ బసివిరెడ్డిని శాంతింప చేయటానికి ప్రయత్నించాడు అక్కడ గుమిగూడిన వారిలో ఒకతను.

"ఆవేశపడుతున్నానా? నా బిడ్డకు జరిగిన అవమానం గనుక నీ బిడ్డకి జరిగివుంటే, నేను ఎందుకు ఆవేశపడుతున్నానో నీకు అనుభవమై వుండేది..." అంటూ కొరడా పట్టుకుని వున్న మనిషి కేసి తిరిగి, "కొట్టు... దేభ్యం ముఖం వేసుకుని రాయిలాగా నిలబడకు... కొట్టు... ఆ పాతిక దెబ్బలు కొట్టేయ్" అని గర్జించాడు బసివిరెడ్డి.

గింగిరాలు తిరుగుతూ గాలిలోకి లేచింది కొరడా... మరుక్షణంలో దెబ్బమీద దెబ్బగా వీరభద్రారెడ్డి వెన్నుమీద వాలటం మొదలుపెట్టింది అది.

రెడ్డిపాలెం గ్రామం మధ్యభాగంలో వున్న శివాలయం ఎదుట జరుగుతోంది ఆ కులపెద్దల సమావేశం... పెళ్ళి కాని ఒక పడుచు ఒంటిమీద చెయ్యి వేయటమే కాకుండా, ఆమె పావడాని లాగేసినందుకుగాను ఆ పాతిక కొరడా దెబ్బలు శిక్ష విధింపబడుతోంది.

వీరభద్రారెడ్డి అలా ఎందుకు చేయవలసి వచ్చిందో, అలా చేసి వుండకపోతే ఏమయివుండేదో మర్చిపోయారు అందరూ. గుర్తు చేయటానికి ప్రయత్నించిన వాళ్ళవంక గుర్రుగా చూసి నోళ్ళు మూయించారు. చినిగి

పోయాయి వీరభద్రారెడ్డి ఒంటిమీది వస్త్రాలు, నెత్తురు మయమై పోయింది వెనుకభాగం... కళ్ళు గిర్రున తిరిగి కిందపడిపోయే పరిస్థితిని పళ్ళబిగువున భరిస్తున్నాడు అతను.

"వీడు ఎక్కడివాడురా? ఇన్ని దెబ్బలు పడినా ఒక్క అరుపు కూడా అరవటం లేదు. ఇదే ఇంకెవరైనా అయి వుంటే ఊరు ఊరంతా అల్లకల్లోలం అయిపోయేటట్టు అరిచి కేకలు పెట్టి వుండేవాడు" ముందు వరసలో ఉన్న పెద్దలకు ఎవరికీ వినిపించకుండా నెమ్మదిగా గొణిగాడు వెనుకగా నిలబడి వున్న వ్యక్తి ఒకతను.

"అరవటానికి వాడు సామాన్యుడు కాదు... శివారెడ్డి కొడుకు... తండ్రికి ఎంత మొండితనం ఉందో, అంతకు మూడింతలు ఎక్కువే ఉంది వీడికి" చిన్నకంఠంతో సమాధానమిచ్చాడు అతని పక్కన వున్న ఇంకో మనిషి.

శివారెడ్డి ప్రసక్తి వచ్చేసరికి చటుక్కున నోరు మూసుకున్నాడు మొదటి మనిషి. ఇంక ఆ సంభాషణను కొనసాగించక అంతటితో ముగించాడు. పాతిక దెబ్బలకు ఒక్కటి కూడా తక్కువ కాకుండా ఖచ్చితంగా లెక్కేసి శిక్షను అమలు చేయించాడు బసివిరెడ్డి.

"పోరా... పోయి ఒళ్ళు దగ్గిరపెట్టుకుని బతుకు... ఇంకెప్పుడు ఊరోళ్ళ ఆడబిడ్డల జోలికి పోకు... పో" ఆఖరి దెబ్బ అయిపోగానే వెక్కిరిస్తున్నట్టు బిగ్గరగా అన్నాడు.

కిందపడిపోయిన తన చేతికర్రను తీసుకోవటానికి ముందుకు వంగాడు వీరభద్రారెడ్డి. అలా వంగటమే అతని ప్రాణాలను కాపాడింది ఆ రోజు.

కందిరీగ మాదిరి ఝుంకారం చేస్తూ అతను నిలబడిన ప్రదేశంలోనించి దూసుకుపోయి బసివిరెడ్డికి దగ్గిర్లో నేలను తాకింది ఒక బాణం. ముందుకు వంగకుండా నిఠారుగా నిలబడి వుంటే అది తప్పకుండా వీరభద్రారెడ్డి వెన్నుమీద కసుక్కున దిగబడి వుండేది.

"దోపిడీ దొంగలు... దోపిడీ దొంగలు... పారిపోండి... అందరూ దూరంగా పారిపోండి" బాణాన్ని చూసీచూడగానే బిగ్గరగా అరిచాడొక వృద్ధుడు.

గొల్లుమంటూ లేచారు అక్కడ వున్నవారందరూ.

చట్రాతిమీద కొట్టిన చిల్లుపెంకుల మాదిరి తలా ఒక పక్కకు పరుగు తీశారు.

మొదటి బాణం దూసుకు వచ్చిన రెండో క్షణంలో- ఒకదాని వెనుక ఒకటిగా వచ్చేశాయి ఇంకా అనేకం. పరుగెత్తుతున్న జనంలో పదిమంది గావుకేకలు పెడుతూ విరుచుకు పడిపోయారు.

పదఘట్టనలతో ఆ ప్రదేశాన్ని కంపింప చేస్తూ వచ్చేశాయి పాతిక అశ్వాలు. దట్టమైన తలపాగాలు ధరించిన ఆగంతకులు అనేకమంది ఉన్నారు వాటిమీద.

"వదిలిపెట్టకండి... పారిపోనీయకండి... వాళ్ళల్లో గ్రామపెద్ద ఎవరో చూసి పట్టుకురండి" కళ్ళేల్ని బిగలాగి, తన అశ్వాన్ని ఆపుతూ బిగ్గరగా అరిచాడు వారిలో ఒక మనిషి. అశ్వాలమీదినించి దూకి, పారిపోతున్న గ్రామస్తుల్ని వెంటాడటం మొదలుపెట్టారు అతని అనుచరులు.

శివాలయానికి దక్షిణం పక్కన వున్న ఒక మండపం చాటుకుపోయి అక్కడినించి గ్రామం వెలుపలికి పారిపోవాలని అనుకున్నాడు బసివిరెడ్డి.

మండపం చాటుకు పోయేటంతవరకూ బాగానే వున్నది. అక్కడినించి రెండు అడుగులు అవతలికి వేసేటంతలో పిశాచాల మాదిరి పోయి పట్టుకున్నారు ఇద్దరు ఆగంతకులు బసివిరెడ్డిని బలంగా.

"గ్రామపెద్ద ఎవరు? వెంటనే చెప్పు... చెప్పకపోతే నీ తలతెగి కిందపడుతుంది" నడుముకు వేలాడుతున్న పొడవాటి కత్తిమీద చెయ్యి వేస్తూ హెచ్చరించాడు వారిలో ఒకతను. ఎండుకు పోయింది బసివిరెడ్డి గొంతు... గుటక పడడం కూడా చాలా కష్టమైపోయింది.

"గణపతిదేవ చక్రవర్తి కుమార్తె రుద్రమదేవి రాజ్యం చేస్తున్న ఈ కాలంలో ఇలా గ్రామాల మీద పడి దోపిడీలు చెయ్యటం అన్యాయం... చక్రవర్తికి తెలిస్తే మీ తలలే తెగి కిందపడిపోతయ్..." ధైర్యం తెచ్చుకుని బింకంగా వారికి సమాధానం ఇచ్చాడు అతను.

పకపకా నవ్వి అతని మెడమీద చెయ్యివేసి ముందుకు నెట్టాడు రెండో ఆగంతకుడు. మెత్తగా వున్న మట్టిలో బోర్లాపడిపోయాడు బసివిరెడ్డి.

"గణపతి దేవుడు స్థాపించిన ఈ కాకతీయ సామ్రాజ్యాన్ని ఒక ఆడది పరిపాలించటం మాకు ఇష్టం లేదు. మీసం ఉన్న ఏ మగవాడైనా సరే ఎదురు తిరిగి అసంతృప్తిని ప్రదర్శించాలి... మేము చేస్తున్న పని అదే..." అంటూ అతని చేతిని పట్టుకుని ముళ్ళకంపని ఈడ్చినట్టుగా బరబరా ఈడ్చుకుంటూ వెళ్ళి శివాలయం ముందుకు తీసుకుపోయాడు మొదటి ఆగంతకుడు.

రుద్రమదేవి సామ్రాజ్యాన్ని పరిపాలించటానికి, గ్రామాల మీదపడి దోపిడీలు చెయ్యటానికి సంబంధం ఏమిటో తెలియలేదు అక్కడే నిలబడి వున్న వీరభద్రారెడ్డికి.

రాజ్యపాలకుల మీద అసంతృప్తి అంటూ వుంటే దాన్ని సూటిగా ఆ పాలకులకే తెలియచెయ్యాలి. అమాయకులైన గ్రామీణుల మీద దాడి చెయ్యటం ఏమిటి?

చేతుల్లోకి తీసుకున్న చేతికర్రను గిర్రున తిప్పుతూ, అశ్వం దిగి నిలబడి వున్న ఆగంతకుల  నాయకుడి మీదికి ఎగబడాలన్న కోరిక కలిగింది అతనికి.

"వద్దు భద్రా... కదలవద్దు..." చిన్నగా అతని చెవికి చేరింది వెనుక నుంచి ఒక మంద్రస్వరం.

తలతిప్పి చూసిన అతనికి, రెండు మూరల దూరంలో నిలబడివున్న కమ్మరి సూరన్న కనిపించాడు.

ఎటువంటి ఇనుపముక్కనైనా అద్భుతమైన ఆయుధంగా తయారు చెయ్యగల నేర్పరి కమ్మరి సూరన్న. వ్యవసాయానికి అవసరమయిన సరం జామాని తయారుచేయటం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

దోపిడీకి వచ్చిన ఆగంతకుల్ని చూడగానే అందరి మాదిరిగా అవతలికి పారిపోలేదతను. నింపాదిగా వచ్చి వీరభద్రుడి వెనుక నిలుచున్నాడు.

"బసివిరెడ్డిని చంపేస్తారు... నిన్నూ, నన్నూ ఎవర్నీ ప్రాణాలతో వదిలిపెట్టరు" చిన్నగా అన్నాడు భద్రుడు.

"నువ్వు పొరపాటు పడుతున్నావ్. వీళ్ళకి కావల్సింది మనం కూడబెట్టు కున్న సొత్తు. మన ప్రాణాలు కాదు... నువ్వు కదలకుండా నిలబడి చూస్తూ వుండు" మళ్ళా అదే స్వరంతో సమాధానం ఇచ్చాడు సూరన్న.

అతని మాటల్లో అసత్యం అంటూ ఏమీ లేదని వెంటనే తెలిసిపోయింది వీరభద్రారెడ్డికి.

కిందపడేసి ఈడ్చుకుంటూ వచ్చిన బసివిరెడ్డిని తమ నాయకుడి ఎదుట నిలబెట్టారు  ఆగంతకులు.

"మీమీద మాకు ఎటువంటి విరోధభావమూ లేదు... మాకు కావాల్సింది మీ ప్రాణాలు కాదు. మీ దగ్గిర వున్న సొత్తు. ఈ మాట మీ గ్రామ పెద్దకు చెప్పి ఇక్కడికి తీసుకురావాలి. తీసుకువస్తావా?" అతని ముఖంలోకి సూటిగా చూస్తూ చెప్పాడు ఆగంతకుల నాయకుడు.

ఒంటికి అంటుకున్న దుమ్మును రెండు చేతులతో దులుపుకుంటూ తలవూపాడు బసివిరెడ్డి.

"ఈ పెద్దమనిషికి తెలివితేటలు చాలా ఎక్కువ. తనే గ్రామ పెద్ద అని చెప్పటంలేదు..." మరోసారి వీరభద్రారెడ్డికి చెప్పాడు కమ్మరి సూరన్న.

"గ్రామపెద్దను పిలుచుకువచ్చే మిషమీద అవతలికి పోయి, అటు నుంచి అటే గ్రామం వెలుపలికి పారిపోతాడు. సందేహం లేదు" అన్నాడు భద్రారెడ్డి.

"దోపిడీలు చెయ్యటానికి వచ్చారని చెప్పి, వాళ్ళ తెలివితేటల్ని తక్కువగా అంచనా వెయ్యకు... బసివిరెడ్డి కంటె గొప్పవాళ్ళు... మన గ్రామాన్ని గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే వాళ్ళు ఇక్కడికి వచ్చారు. అంతేగాని గుడ్డిగా రాలేదు" అన్నాడు సూరన్న.

ఆ మాటలు కూడా నిజమేనని వెంటనే తెలిసిపోయింది భద్రారెడ్డికి. తను చెప్పిన దానికి వెంటనే తల ఊపుతున్న బసివిరెడ్డి వంక చూస్తూ వెక్కి రింపుగా నవ్వాడు ఆగంతకుల నాయకుడు. ఉన్నట్లుండి ఒక అడుగు ముందుకు వేసి అతని చెంపమీద బలంగా కొట్టాడు.

"ఎందుకు కొడుతున్నారు నన్ను? ఏం చేశాను నేను?" ఛెళ్ళుమన్న చెంపను చేతితో తడుముకుంటూ అయోమయంగా అడిగాడు బసివిరెడ్డి.

"నీ గురించి తెలుసుకోకుండానే మేము ఇక్కడికి వచ్చామని అను కున్నావా? ఇంతమంది గ్రామంలో వుండగా- నిన్ను మాత్రమే ఎందుకు పట్టుకున్నామో తెలియదా?" పకపకా నవ్వుతూ అన్నాడు నాయకుడు.

తన గుట్టు తనకు తెలియకుండానే రట్టు అయిపోయినట్టు గ్రహించి, నవ్వు మొఖం పెట్టాడు బసివిరెడ్డి.

"మీ గ్రహణశక్తి అమోఘం. నాగురించి తెలుసుకోలేరని అనుకున్నాను" అంటూ రెండు మెచ్చుకోలు మాటలు మాట్లాడబోయాడు బసివిరెడ్డి.

చేతిని విదిలించి వెంటనే అడ్డుకున్నాడు అతన్ని ఆగంతకుల నాయకుడు.

"మాకు కావాల్సింది మెచ్చుకోలు మాటలు కాదు.... మీ సొత్తు... వెంటనే అందరినీ పిలిచి ఇక్కడ సమావేశపరుచు" అని ఆజ్ఞ ఇచ్చాడు నాయకుడు.

ప్రాణాల్ని చేతుల్లో పెట్టుకుని తలా ఒక పక్కకి పారిపోయిన గ్రామస్తుల నందర్నీ తిరిగి అక్కడికి రప్పించటం అంటే సామాన్యమైన పనికాదని బసివిరెడ్డికి

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Veerabhadra+Reddy

* * *